ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587 (305.8626)	2,48,235	2,55,811
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.00 (3.94)	953.00	620.46
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.123 (31.9765)	2,41,285	47,698

చికెన్ ధరలు: లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

సాగర్ నుంచి.. సాగరానికి



సాగర్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కృష్ణమ్మకు వాయినం సమర్పిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్

ఆధునిక దేవాలయం నాగార్జునసాగర్ జలాశయం నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు ప్రారంభమయ్యాయి. ఎగువనుంచి 2,55,811 క్యూసెక్కులనీరు సాగర్‌కు వచ్చి చేరుతుండగా, సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండటంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11.28 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనారిటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్విచ్‌ఆన్‌చేసి నీటి విడుదలను ప్రారంభించారు.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

7

అర్హులకు రేషన్‌కార్డులు



కట్టంగూరులో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, తదితరులు

మంత్రులు అడ్లూరి, ఉత్తమ్

పెద్దవూర, కట్టంగూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు పంపిణీచేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, భారీ నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పెద్దవూర, కట్టంగూర్ మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, వేముల వీరేశంతో కలిసి నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు అందించి కడుపు నింపాలన్నదే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 97లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా 84 శాతం జనాభా 3.15కోట్ల మంది సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, ఇక ముందు కూడా అర్హులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. రెండు సీజన్లుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టాన్ని చేరుకోవడం అదృష్టమన్నారు. గత ఏడాది రెండు సీజన్లు కలిపి 2.81కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తూ, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నది ఒక్క తెలంగాణేనన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు, ఇంటిని నిర్మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదలకు ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. సాగర్ నియోజకవర్గానికి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఇప్పటికే 72,284 రేషన్ కార్డులు ఉండగా, కొత్తగా 8,231 కార్డులు ఇచ్చామన్నారు. జిల్లాలో కొత్తగా 62,700 రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తిచేస్తామన్నారు. రేషన్‌షాపు నిర్వాహకులకు ఇచ్చే కమీషన్‌కు సంబంధించిన ఫైలను సమర్పించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్‌ను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్.చౌహాన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పెద్ద సుక్కయ్య, శంకర్, నర్సింహ, యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ సేవలు మరింత ప్రియం



» వాహన రిజిస్ట్రేషన్, లైసెన్స్ చార్జీలను పెంచిన ప్రభుత్వం » 50 నుంచి 100 శాతం పెరిగిన చార్జీలు » ఉమ్మడి జిల్లాలో అదనపు భారం రోజుకు రూ.లక్ష, ఏడాదికి రూ.3 కోట్లకు పైనే

రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖ ద్వారా అందించే సేవల చార్జీలను గుట్టుచప్పుడు కాకుండా పెంచింది. ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో రవాణాశాఖ అందించే వివిధరకాల సేవల చార్జీలను అమాంతం పెంచింది. ఒక్కో సేవకు ప్రస్తుత చార్జీలపై 50 నుంచి 100 శాతం పెంచింది. దీంతో వాహనదారులు ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాంటి సమాచారం లేకుండా ఆన్‌లైన్‌లో పెంచిన చార్జీలను అప్‌లోడ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ వివిధ సేవలకు గాను గతం కంటే రూ.లక్ష అదనం గా వినియోగదారులు భరించాల్సి వస్తోంది. ఏడాదికి సుమారుగా రూ.3 కోట్ల భారం పడుతోంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

రవాణా శాఖ చార్జీలు సవరించి సుమారు ఎనిమిదేళ్లు దాటడంతో పెంచినట్లు సమాచారం. పెరిగిన చార్జీలు ఈ నెల 28 నుంచి అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా వాహనాల రిజిస్ట్రేషన్, హైపోథికేషన్, వాహన యాజమాన్య బదిలీ, ఆర్సీల రెన్యూవల్, ఒక ప్రాంతం చిరునామా నుంచి మరో ప్రాంత చిరునామాకు వాహనాల బదిలీలకు సంబంధించిన క్లియరెన్స్ సర్టిఫికెట్లు, ఎన్‌వోసీల జారీకి చార్జీలను రూ.100 నుంచి రూ.వేలలోకి పెంచారు. అంతకు ముందు వివిధరకాల సేవల కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి రవాణాశాఖ కార్యాలయాల్లోకి వెళ్లిన సందర్భాల్లో పెరిగిన చార్జీలు భారంగా మారాయి. గతంలోని చార్జీలతో స్లాట్ బుక్ చేసుకున్న వారు వారికి కేటాయించిన తేదీల్లో కార్యాలయాల్లోకి వెళ్లగానే పెంచిన చార్జీలు అమలులో ఉంచడంతో మిగిలిన మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 9 లక్షలకు పైగా వాహనాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్నిరకాల వాహనాలు కలిపి...

మిగతా 8వ పేజీలో...

అమలులో పెరిగిన చార్జీలు

రవాణా శాఖ ద్వారా వాహనదారులకు అందించే వివిధ రకాల సేవల చార్జీలను ఇటీవల ప్రభుత్వం పెంచింది. పెరిగిన చార్జీలు అమలులోకి వచ్చాయి. వాహనదారులు పెరిగిన ఆ చార్జీలు చెల్లించి రవాణా శాఖ సేవలు పొందాల్సి ఉంది. గతంలో స్లాట్ బుక్ చేసుకున్న వారు పెరిగిన చార్జీల ప్రకారమే మిగిలిన డబ్బును చెల్లించాల్సి ఉంటుంది. రవాణా శాఖ ద్వారా వాహనదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం.

-డాక్టర్ వాణి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, నల్లగొండ.

పెరిగిన చార్జీల వివరాలు

రవాణా శాఖ ద్వారా వాహనదారులకు అందించే వివిధరకాల సేవలకు సంబంధించి చార్జీలు వివరాలు ఇలా ఉన్నాయి.

సేవలు	ప్రస్తుత చార్జీలు	పెరిగినవి
బైక్ లెర్నింగ్	రూ.300	రూ.350
పర్మినెంట్ లైసెన్స్	రూ.1335	రూ.1450
(బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాలకు)		
యాజమాన్యబదిలీ	రూ.935	రూ.1805
హైపోథికేషన్	రూ.2135	రూ.3135
రిజిస్ట్రేషన్ చార్జి (రవాణేతర బైక్‌లకు)	రూ.200	రూ.210
(ఇతర వాహనాలకు)	రూ.400	రూ.440
ఆటో రిక్షా ఆర్సీ	రూ.150	రూ.250
ఆటోరిక్షా పర్మిట్	రూ.100	రూ.200

ఎన్నికల హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేస్తామని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని విమర్శించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు సెలవు ఇవ్వకుండా స్పెషల్ ఆఫీసర్ల వేధిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు దుస్తులు, సబ్బులు, చెప్పులు నూనె, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోలే సాంబయ్య, సీఐటీయూ నాయకులు పెంజర్ల సైదులు, పొన్న అంజయ్య, గండమల్ల ఆశీర్వాదం, ఎండి. జహీర్, పి.సర్వయ్య, ఎర్ర అరుణ, కె.నరసయ్య, ఎన్.నరసింహ, రమేష్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రకాష్‌నగర్ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి విభాల్లో సిబ్బంది పనితీరును పర్యవేక్షించి రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో మందుల వివరాలను తెలుసుకొని స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. కలరా, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలకుండా పాటించాల్సిన వ్యక్తిగత జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి పరిధిలోని 13 పాఠశాలలు, హాస్టళ్లను వైద్యసిబ్బంది సందర్శించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు తప్పనిసరి రక్త పరీక్షలు చేయించాలన్నారు. పట్టణంలో పారిశుధ్యలో పాలను గుర్తించి మునిసిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనవెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేసా రవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిపుణ్, ఎన్‌సీడీ వేణుగోపాల్‌రెడ్డి, టీబీ నియంత్రణ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి, సూపర్‌వైజర్ ప్రమీల, ఫార్మసిస్ట్ మౌనిక, ఎల్ టీ కళ్యాణి, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

డెంగీ పేరుతో భయపెడితే చర్యలు



రూ.18లక్షల చెక్కును అందజేస్తున్న మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రులు డెంగీ పేరుతో భయభ్రాంతులకు గురిచేయవద్దని, అలాచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. డెంగీ పేరుతో కొన్ని ఆస్పత్రులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా మరోసారి జ్వర సర్వేను నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు పాఠశాలలను, హాస్టళ్లను తప్పనిసరిగా సందర్శించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.18లక్షల సాయం అభినందనీయం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): టీబీ కేసులను అప్పటికప్పుడే నిర్ధారించే పరికరాలకోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.18లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మొబైల్ టీబీ ఎక్లరే పరికరం కోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌కు రూ.18లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీనివాస్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంటా సంతోష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, నల్లగొండ సంఘం అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి భద్రాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభ్యున్నతికి తోడ్పడాలి

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

6

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు

నల్లగొండ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పోరాడే ఏకైక సంఘం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ అని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు మేలు జరుగుతుందంటే అది 1104 యూనియన్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగులను ముందుండి నడిపించామన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యమంలో పెద్దన్న పాత్ర పోషించామన్నారు. ప్రత్యేక ఒప్పంద విధి విధానాలను పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్కిల్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.జైపాల్‌రెడ్డి, నిమ్మచెట్ల వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్, అదనపు సెక్రటరీలుగా కె.శ్రీనివాసులు, ఎల్.సత్యనారాయణలు ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ అధ్యక్షుడు కె.రాజేందర్, అదనపు కార్యదర్శి జి.వరప్రసాద్, సలహాదారుడు ఆర్.జనార్ధన్‌రెడ్డి, ఎస్ఈ ఎ.వెంకటేశ్వర్‌రావు, టెక్నికల్ డీఈ కృష్ణారావు, ఎస్ఏవో సుచేందర్, సీఈ అన్నయ్య, సీహెచ్.విద్యాసాగర్‌రావు, బి.వెంకటయ్య, ఎం.శ్రీనివాసచారి, డి.ప్రభాకర్, కె.వేణు, ఎన్.వెంకన్న, ఎస్.భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎన్.సీతారాములు, మేరెడ్డి రాంరెడ్డి, శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన సైకిల్ సవారీ

రెండు దశాబ్దాలకు కిందట ఇంట్లో సైకిల్ ఉండటాన్ని గౌరవంగా భావించే వాళ్లు. ఏ పనికైనా దానిపై వెళ్లడం సౌకర్యంగా ఉండేది. సకల జనుల వాహనం అది. ఉదయం కూరగాయలు, పాలు విక్రయించే వారి నుంచి కల్లుగీత కార్మికుల వరకు నిత్యావసరాల్లో ఒకటిగా ఉండేది. ట్రింగ్ ట్రింగ్ అనే శబ్దాలు గ్రామాల్లో వినిపిస్తుండేవి. రానురాను సైకిళ్ల స్థానంలో ద్విచక్రవాహనాలు వచ్చి చేరాయి. కొద్దిపాటి దూరానికైనా ఇప్పుడు వాటినే ఉపయోగిస్తున్నారు. దీంతో సైకిల్ చక్రం తిరగడం తగ్గింది. ఆరోగ్యమూ, ఆనందమూ ఇచ్చే సైకిళ్ల సవారీపై ప్రత్యేక కథనం.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

గుమ్మంలో ట్రింగ్ ట్రింగ్ అనే శబ్దం విన్న ఇల్లాలు పాలవాడు వచ్చినట్టుందీ తీసుకోమ్మా అంటూ కూతురికి చెప్పేది. మరోచోట ట్రింగ్ ట్రింగ్ శబ్దం విని కూరగాయల వాళ్లు వచ్చారనుకుంటా, ఆగమని చెప్పు వెళ్తాడేమో అంటూ బయటికి వచ్చే గృహిణుల ఆరాటం. ఆ శబ్దం వారికి నిత్య శ్రవణానందం. నిత్యావసరాల నుంచి అవసరాలకు దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఒకప్పుడు సైకిల్ సామాన్యుడి పుష్పకవిమానం.



చిన్న సైకిల్ రిపేర్ చేస్తున్న చంద్రమౌళి

ఒకప్పుడు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ ప్రతినిత్యం సైకిల్ వినియోగం ఎక్కువగా ఉండేది. ట్రింగ్ ట్రింగ్ మనే శబ్ధాలు మారుమోగేవి. రైతులు పొలం పనులకు వెళ్లేందుకు, వచ్చేప్పుడు సైకిళ్లపై పశుగ్రాసం తీసుకొని ఇంటికి తెచ్చేందుకు సైకిల్ ఎంతో ఉపయోగపడేది. తెల్లవారుజామునే గీత కార్మికులు సైకిల్‌కు తాటిమటువలు వేసుకొని వెళ్లి తాటికల్లు తెచ్చేవారు. పొద్దుపొద్దున్నే సైకిల్ మీద తాజా కూరగాయలు తీసుకుని ఊరూరా చిరువ్యాపారులు తిరిగేవారు. కూలీలు, చిరుద్యోగులకు ప్రతీ ఒక్కరికి తక్కువ పెట్టుబడితో సురక్షితంగా గమ్యాలకు చేర్చే వాహనం సైకిల్. ప్రధానంగా సైకిల్ బెల్ శబ్ధంతో పాలవాళ్లు వచ్చారనేది అదో నమ్మకంగా ఉండేది. సైకిల్ తొక్కడం అనేది వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు కలిసివచ్చేది.

- ● తగ్గుతున్న సైకిల్ వాడకం
- ● ఇంధన వాహనాల మోజులో యువత
- ● కనుమరుగవుతున్న సైకిల్ ట్రింగ్..ట్రింగ్ మోత

క్రమక్రమంగా తగ్గుముఖం


నేటి ఆధునిక కాలంలో సైకిల్ వినియోగం తగ్గుముఖం పట్టింది. సైకిల్ బెల్ శబ్ధం అరుదుగా వినిపిస్తుంది. ఒకప్పుడు పేద, మధ్య తరగతికి వారికి రవాణా సౌకర్యం ఉన్న సైకిల్ వినియోగం క్రమక్రమంగా తగ్గుతోంది. పెరిగిన సాంకేతికత, అవసరాలతో ఇంధన వాహనాలపైనే మోజు బాగా పెరిగింది. ప్రతినిత్యం అవసరమైన పనులన్నీ ద్విచక్ర వాహనాలపైనే సాగుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించిన సైకిల్ వినియోగం తగ్గడంతో అనారోగ్యాల బారిన పడే వారి సంఖ్య పెరిగింది. శరీరానికి శ్రమలేకుండా అవసరాలు తీరుతుండటంతో ద్విచక్ర వాహనాలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ఎటువంటి కాలుష్యం వెదజల్లని సైకిళ్లను పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు, చిరు వ్యాపారులకు, పేదలకు ఉచితంగా సైకిళ్లు అందించి వారిని ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

పెద్దసైకిళ్లు వినియోగం లేకుండాపోయాయి

పదేళ్ల నుంచి పెద్దసైకిళ్లు పూర్తిగా వినియోగంలో లేకుండాపోయాయి. గతంలో గీత, కమ్మరి, కుమ్మరి, రైతులు, కూలీలు అందరు సైకిళ్లు వాడేవారు. ప్రస్తుతం వాటికి స్వస్తిపలికి ఇంధన వాహనాలను వాడుతున్నారు. ప్రస్తుతం కేవలం విద్యార్థులు, చిన్న పిల్లల మాత్రమే సైకిళ్లు వినియోగిస్తున్నారు. వ్యాపారం పూర్తిగా దెబ్బతింది.

- కోల చంద్రమౌళి, యాదగిరిగుట్ట

సైకిల్‌తో అనారోగ్య సమస్యలు దూరం



ప్రతి రోజూ సైకిల్ తొక్కితే అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. సైకిల్ తొక్కడంతో శరీరంలో ప్రతి అవయవం కదిలి చక్కని వ్యాయామంగా ఉపయోగపడుతుంది. వాకింగ్ చేస్తే కలిగే శక్తి కంటే సైకిల్ తొక్కడం మరింత మేలును చేస్తుంది.

- రఘుపతిరెడ్డి, వైద్యులు, భువనగిరి

తాటివనాలకు వెళ్లేందుకు సైకిలే ప్రధానం



గీత కార్మికులు ప్రతి రోజూ తాటి, ఈత చెట్ల వద్దకు వెళ్లేందుకు సైకిలే ప్రధానం. సైకిలుకు శరీరంలో ఉన్న శక్తే ఇంధనం. ఎక్కడ పడితే అక్కడ నిలిపి చెట్టు చెట్టుకు తిరగడానికి ఎంతో అనువుగా ఉంటుంది. కల్లు తీసుకరావడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

- కోలా మైసాగౌడ్, కల్లుగీత కార్మికుడు, కొత్తగుండ్లపల్లి

పశుగ్రాసం, కట్టెలు తెచ్చేవాళ్లం



బావుల వద్దకు వెళ్లడానికి సైకిల్ ఎంతో అవసరం. ఎలాంటి ప్రమాదం లేకుండా స్వయం శక్తితో నెమ్మదిగా గమ్యాన్ని చేరుకోవచ్చు. బావుల వద్ద నుంచి ఇంటికి పశుగ్రాసం, ఎరువులు, పొయ్యిల్లోకి కట్టెలు సైతం తెచ్చేవాళ్లం. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా కూడా ఉండేవాళ్లం.

- పేరబోయిన కొమురయ్య, కొత్తగుండ్లపల్లి

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



ప్రదీప్(ఫైల్)

కొత్తపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో గుండెపోటుతో కానిస్టేబుల్ మృతిచెందాడు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన నల్ల ప్రదీప్ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఎస్‌బీహెచ్ కాలనీలో ఉంటూ ఎల్‌బీనగర్ క్రైమ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం ఇంట్లో టిఫిన్ చేస్తూ అకస్మాత్తుగా కిందపడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆయన్ను సమీపంలోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య ఎస్‌హెచ్‌వో వినోద్‌కుమార్, ఎస్‌ఐలు ప్రదీప్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్వగ్రామాలకు 29 మంది వలస కార్మికుల తరలింపు



వలస కార్మికులను వారి స్వగ్రామాలకు పంపిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

నేరేడుగొమ్ము, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా పనిచేయిస్తున్న 29 మంది వలస కార్మికులను స్వగ్రామాలకు తరలించినట్లు నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ, పీఏపల్లి మండలం పెద్దగుమ్మడడం గ్రామాల్లో బిహార్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 29 మందితో మత్స్యకార్మికులు వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆర్డీవోతెలిపారు. మంగళవారం వారిని గుర్తించి స్వగ్రామాలకు తరలించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం


మిర్యాలగూడ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం రైల్వే పోలీస్ ఫోర్స్ కొత్త భవనం సమీపంలోని ఖాళీప్రదేశంలో మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి వయసు 55 ఏళ్ల వరకు ఉంటుందని, శరీరంపై ఎలాంటి దుస్తులు లేవని, బ్లాకలర్ డ్రాయర్ మాత్రమే ఉందని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నించగా రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తూ బిక్షాటన చేసే వ్యక్తిగా తెలిసిందన్నారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీగదిలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఆనవాళ్లు గుర్తించిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన 8712670189, 8712670151 సెల్‌ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ప్రయాణికురాలి సెల్‌ఫోన్ అప్పగింత

దేవరకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను డ్రైవర్, కండక్టర్ తిరిగి అప్పగించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన బస్సు కొండమల్లేపల్లి నుంచి దేవరకొండకు వస్తుండగా మహబూబి అనే ప్రయాణికురాలు తన సెల్‌ఫోన్‌ను మంగళవారం బస్సులో మరిచి దిగిపోయింది. గమనించిన డ్రైవర్ శ్రీను, కండక్టర్ సాయిబాబా సెల్‌ఫోన్‌ను డిపో అధికారులకు అప్పగించారు. బాధితురాలు సాయంత్రం మరో ఫోన్ ద్వారా వివరాలు తెలపడంతో ఆమె బంధువుకు ఫోన్‌ను అప్పగించినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ సైదులుగౌడ్ తెలిపారు. డ్రైవర్, కండక్టర్‌ను పలువురు అభినందించారు.

రాష్ట్ర అభ్యున్నతికి తోడ్పడాలి

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పక్కన ఎంజీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో చురుకైన పాత్ర పోషించిన విశ్వ విద్యాలయాలు, అభ్యున్నతిలో సైతం తోడ్పాటు అందించాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ప్రజావిచారణ నిర్వహించారు. తొలుత విశ్వ విద్యాలయ ప్రస్థానం, ప్రస్తుత స్థితిగతులపై ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో యూనివర్సిటీలో సమస్యలు, అవసరాలపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర అభ్యున్నతికి సైతం తోడ్పడాలన్నారు. విద్య, విముక్తి, అభ్యున్నతికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించి నైపుణ్యాలను, నైతికత, సమతాభావన, దేశభక్తిని పెంపొందించే గురుతర బాధ్యత యూనివర్సిటీలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు అరుణ ప్రియ, ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, రేఖ, మదిలేటి, మిర్యాల రమేష్, దోమల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య

తొర్రూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని అభ్యాస్ పాఠశాల హాస్టల్‌లోని 10వ తరగతి విద్యార్థి బానోత్ వెంకటచైతన్య(15) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన మంగళవారం జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ శివారు మర్రికుంట తండాకు చెందిన బానోత్ వెంకన్న-అనిత దంపతుల కుమారుడు వెంకటచైతన్య మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని అభ్యాస్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా ఒంటరిగా ఉంటూ, నిత్యం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన పుస్తకాలు చదువుతూ, స్నేహితులకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 27న రాత్రి హాస్టల్‌లో ఎలుకల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు హుటాహుటిన స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి తల్లిదండ్రులు చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యంతో కలసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు మృతికి గల కారణాలు తెలపాలని పాఠశాల ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ గణేష్, ఎస్‌ఐ ఉపేందర్ సంఘటనా స్థలంలో బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. తన కుమారుడి మృతికి గల కారణాలు తెలపాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేందర్ వెల్లడించారు.



రోదిస్తున్న వెంకటచైతన్య కుటుంబ సభ్యులు, వెంకటచైతన్య(ఫైల్)

హాస్టల్‌లోకి ఎలుకల మందు ఎలావచ్చింది?

తిరుమలగిరి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలకేంద్రంలోని అభ్యాస్ పాఠశాల హాస్టల్‌లోకి ఎలుకల మందు ఎలా వచ్చిందని పదో తరగతి విద్యార్థి వెంకటచైతన్య తల్లి దండ్రులు ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మర్రికుంట తండా గ్రామానికి చెందిన బానోత్ వెంకట్‌చైతన్య తల్లిదండ్రులు బానోత్ అనిత, వెంకన్న దంపతులు విలేకరులతో మాట్లాడారు. తమ కుమారుడు వెంకట్‌చైతన్య ఈ నెల 27న సాయంత్రం హాస్టల్‌లో ఎలుకలమందు తాగాడని, తొర్రూరులోని ఆస్పత్రికి, అక్కడినుంచి వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పాఠశాల యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చిందన్నారు. దీంతో తాము షాక్‌కు గురయ్యామన్నారు. వెంకట్‌చైతన్య చదువులో ముందుండేవాడని, ఉపాధ్యాయుల ఒత్తిడితోనే ఇలా జరిగిందని ఆరోపించారు. వ్యవసాయం చేసి జీవించే తమకు కుమారుడు, కుమార్తె ఉండగా, ఒక్కగానొక్క కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో తమకు దిక్కెవరంటూ తల్లిదండ్రులు విలపించడం స్థానికులను కలిచివేసింది. మర్రికుంటతండాలో మంగళవారం సాయంత్రం వెంకట్‌చైతన్య అంత్యక్రియలను నిర్వహించారు.

పశువులు అక్రమంగా తరలిస్తుండగా పట్టివేత

కోదాడ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గంపేట పశువుల సంతలో 35 పశువులను కొనుగోలు చేసి వాటిని డీసీఎంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం ఉదయం తనిఖీల్లో పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్ సేవా మధుబాబు, డీసీఎం యజమాని, పశువుల వ్యాపారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చింతపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. మండలంలోని సాయిరెడ్డిగూడెం గ్రామశివారులో రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందుకుని పట్టుకున్నామన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

- ● న్యాయంచేయాలని కుటుంబసభ్యుల రాస్తారోకో



చికిత్స పొందుతూ మృతి చెందిన భాను(ఫైల్‌ఫోటో), రాస్తారోకో చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

భువనగిరి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పొలం గట్టు వివాదం ఓ వ్యక్తి ప్రాణాలు బలిగొంది. ఈ సంఘటన యాదాద్రిభువనగి జిల్లా భువనగిరి మండలంలోని వడపర్తిలో జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వడపర్తికి చెందిన తోటకూరి వెంకటయ్య కుమారుడు తోటకూరి భాను(32) ఈ నెల 22న తన వ్యవసాయ బావి వద్ద పొలంగట్టు పనులు చేస్తుండగా పక్కన ఉన్న వ్యవసాయ భూమికి చెందిన సమీప బంధువులు(పాలివాల్లు) తోటకూరి మల్లేశ్ సోదరుడి కుమారుడు తోటకూరి అజయ్, తల్లి తోటకూరి శంకరమ్మ అక్కడికి వచ్చి తోటకూరి వెంకటయ్య, భానుతో దారి విషయంలో గొడవపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్రఘర్షణ నెలకొనడంతో మల్లేశ్ గొడ్డలితో భాను తలపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన భానును భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యులు తెలపడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజుల పాటు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భాను తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు తోటకూరి మల్లేశ్, తోటకూరి అజయ్, తోటకూరి శంకరమ్మలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. భానుకు భార్య శ్రీలత, కుమారులు అనిల్‌కుమార్, కన్నయ్య ఉన్నారు.

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

తోటకూరి భానును హత్య చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుని బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, గ్రామస్థులు మూడు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. భువనగిరి- జగదేవ్‌పూర్ రహదారికి ఇరువైపులా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భువనగిరి ఏసీపీ రాహుల్ రెడ్డి, రూరల్ సీఐ చంద్రబాబు ఘటనా స్థలానికి వెళ్లి వారిని నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

- ● పరారీలో మరో ముగ్గురు నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న కేసులో నల్లగొండ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని కేశవరావు నగర్‌కాలనీకి చెందిన తలమాల శివశంకర్, సికింద్రాబాద్‌కు చెందిన భక్తుల శబరిగిరిష్, నార్కట్‌పల్లికి చెందిన యాస బానుప్రకాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ పట్టణానికి చెందిన మేడబోయిన చక్రి, వట్టికోటి శేఖర్, మేకల రామ్‌చరణ్ పరారీలో ఉన్నారు. తలమాల శివశంకర్, భక్తుల శబరిగిరిష్ రాజస్థాన్‌లోని వివేకానందా గ్లోబల్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేశాడు. ఆ సమయంలో ఇద్దరు గంజాయి అలవాటు పడ్డాడు. శివశంకర్, భానుప్రకాష్‌రెడ్డి ఇంటర్ నుంచి స్నేహితులు. శివశంకర్ తనకు గంజాయి అవసరం ఉన్నప్పుడల్లా స్నేహితులైన శబరిగిరీష్, భానుప్రకాష్ నుంచి తీసుకునేవాడు. శబరిగిరీష్ హైదరాబాద్‌లో పహాత్‌నగర్ నుంచి గంజాయి తెచ్చే వాడు. గత సంవత్సరం గంజాయి కేసులో పట్టుబడి జైలుకు వెళ్లాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. నిందితుడు శివశంకర్ నల్లగొండ పట్టణంలో గంజాయి అలవాటు ఉన్నవారికి విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని వారం రోజుల క్రితం ఈ ముగ్గురు నిందితులు కలిసి పహాత్‌నగర్‌లో ఓ మహిళ నుంచి 1.5కేజీల గంజాయి కొనుగోలు చేసి నల్లగొండకు తీసుకొచ్చారు. అందులో కొంతభాగాన్ని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి నల్లగొండలో అవసరమున్న వారికి ఒక ప్యాకెట్‌ను రూ.800ల చొప్పున విక్రయించారు. మిగిలి ఉన్న గంజాయిని సమానంగా పంచుకొని ఈ నెల 28న విక్రయించడానికి వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు, గోపాల్‌రావు, సిబ్బంది షకీల్, సత్యనారాయణ, లింగస్వామి, సైదులు, అకిల్‌లను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 350 మందిపై కేసులు

సూర్యాపేట క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా 350 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. జరిమానాలు మార్పు కోసమేనని తెలిపారు. మద్యం మత్తులో పలుమార్లు పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నర్సింహ అన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

డ్రంకెన్ డ్రైవ్ కేసులో కోర్టు ఒకరికి జైలుతో పాటు పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా ఒకరికి ఒకరోజు జైలు శిక్ష అదేవిధంగా రూ. 2వేలు జరిమానా విధించారని, మిగిలిన ఏడుగురికి కలిపి రూ.6,500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెలిమినేడులో రాయితీ యూరియా పక్కదారి!

యూరియా, నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు?

చిట్యాల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పక్కదారి పట్టించిన రాయితీ యూరియాను నల్లగొండ, చిట్యాల పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లా హైదరాబాద్-విజయవాడ రహదారి మార్గంలో చిట్యాల వెలిమినేడు శివారులో సుర్కంటిగూడెం వెళ్లే మార్గం వద్ద నిర్వహిస్తున్న ఎడీబ్లూ డీఈఎఫ్ ఆయిల్ కేంద్రంలో వాడేందుకు యూరియాను నిల్వ చేసి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నల్లగొండ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసులు, చిట్యాల పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. రాయితీ యూరియా బస్తాలు అక్రమంగా నిల్వచేసి ఉన్నాయి. యూరియా బస్తాలు, వాటి రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రాయితీ యూరియాను సరఫరా చేసిన వారిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. పట్టుబడిన రాయితీ యూరియా బస్తాలు సమీపంలోని పీఏసీఎస్ నుంచి సరఫరా జరిగినట్లుగా అనుమానిస్తున్నారు. స్థానికులు కూడా యూరియా బస్తాలు ఇక్కడి నుండే సరఫరా జరిగినట్లుగా తెలిపినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రాయితీ యూరియా తరలింపులో భాగస్వాములు ఎవరెవరు ఉన్నారని పోలీసులు విచారిస్తున్నారు. ఈ విషయంపై చిట్యాల ఎస్‌ఐ రవికుమార్‌ను వివరణ కోరగా విచారణ జరుగుతుందని, వివరాలు తర్వాత వెల్లడిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఎడీబ్ల్యూ డీఈఎఫ్ ఆయిల్ కేంద్రాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లు తనిఖీ చేసిన మరునాడే అక్రమంగా తరలించిన రాయితీ యూరియాను పోలీసులకు పట్టుబడటం గమనార్హం.

న్యాయం చేయాలని ట్యాంక్ ఎక్కిన మహిళ




ట్యాంక్‌పై లక్ష్మీదేవి

చింతపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భూపంపిణీ విషయంలో తనకు న్యాయం చేయాలని ఓ మహిళ మిషన్‌భగీరథ ట్యాంక్ ఎక్కింది. న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కిందికి దిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వింజమూరులో మంగళవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి మండలంలోని వింజమూర్ గ్రామానికి చెందిన ఆరేకంటి లక్ష్మీదేవికి ఇద్దరు సంతానం. ఆమె కూలిపని చేసుకుంటూ జీవిస్తోంది. 2009లో ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అప్పటి నుంచి కూలి పని చేస్తోంది. వారసత్వంగా చెందాల్సిన భూమి వివాదంలో అత్తా, మరిదితో ఆమెకు వివాదం నెలకొంది. మంగళవారం లక్ష్మీదేవి తమకు చెందాల్సిన భూమి పంపిణీ చేసి తగిన న్యాయం చేయాలని మిషన్‌భగీరథ ట్యాంకు ఎక్కింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్యాంక్‌పై ఉన్న లక్ష్మీదేవి వద్దకు వెళ్లి నచ్చజెప్పారు. దీంతో ఆమె కిందికి దిగివచ్చింది.



సాగర్ ప్రాజెక్ట్ వద్ద ఫొటో దిగుతున్న పర్యాటకులు

- సాగర్ వైపునకు కృష్ణమ్మ పరుగులు
- సాగర్‌కు పెరిగిన వరద
- 587.60 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఎగువ నుంచి 2,55,811 క్యూసెక్కుల వరద రాక
- సాగర్ నుంచి 2,48,235 క్యూసెక్కుల విడుదల
- సాగర్‌లో మొదలైన పర్యాటకుల సందడి



నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

మహాబలేశ్వరంలో పుట్టి, కొండలు కోనలు, వాగులు వంకలు దాటుతూ కృష్ణ బేసిన్‌లో ఉన్న అల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులను నింపుతూ నాగార్జునసాగర్‌కు చేరుకున్న కృష్ణమ్మ. సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తడంతో సాగర్ నుంచి సాగరం వైపునకు పరుగెడుతోంది. ఏడాది కాలంగా బోసిపోయిన నది పరివాహక ప్రాంతం అంతా ఒక్కసారిగా కృష్ణమ్మ గలగలలతో, రాళ్ల మధ్యలో వంపులు తిరుగుతూ సవ్వడులు చేస్తూ సాగర్ నుంచి 21 కిలో మీటర్ల దూరంలో ఉన్న టెయిల్ పాండ్‌కు చేరుకుంది.అక్కడి నుంచి 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 149 కిలో మీటర్ల దూరం ఉన్న ప్రకాశం బ్యారేజీకి చేరుకొని హంసల దీవి వద్ద సాగరంలో కలుస్తుంది.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

కనులారా వీక్షించే.. కృష్ణమ్మ సోయగం

సాగర్ ప్రాజెక్టుకు మంగళవారం ఉదయం వరద రాక పెరిగింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 587.60 అడుగులు(305.8626టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 2,55,811 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం ఉదయం 11:30 గంటలకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ప్రాజెక్టు అధికారులతో కలిసి మొదటగా ఆరు క్రస్ట్‌గేట్లను స్విచ్ ఆన్‌చేసి ఐదు అడుగుల మేర పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో 546 అడుగుల ఎత్తు నుంచి కృష్ణమ్మ తెల్లని పాలపొంగు వలె జాలువారుతూ దిగువకు ఉరకలేసింది. ఉదయం 11:30 గంటలకు ఆరు క్రస్ట్‌గేట్లను ఎత్తిన అధికారులు క్రమక్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ సాయంత్రం నాలుగయ్యే వరకు 26 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తారు. 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,48,235 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా 28,420 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వ ద్వారా 7,033 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 6,634 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,48,235 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ఏడు క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి, అలాగే రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 2,55,811 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మంగళవారం ఉదయం ఎత్తడంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి పర్యాటకుల కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు సాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాంపైకి ఎవరికీ అనుమతి లేకపోవడంతో పర్యాటకులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో నిల్చొని కృష్ణమ్మ అందాలను తిలకిస్తున్నారు. బుధవారం నుంచి పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పర్యాటకులు కృష్ణమ్మ అందాలను తమ సెల్ ఫోన్లలో బంధిస్తూ సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు.



నిండుకుండలా పులిచింతల ప్రాజెక్ట్



సాగర్‌లో సెల్ఫీ దిగుతున్న చిన్నారులు



సాగర్‌లో సెల్ఫీ దిగుతున్న కుటుంబ సభ్యులు

చింతలపాలెంలో.. మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా

చింతలపాలెం: ఎగువ ప్రాంతం నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో పులిచింతల ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుంది. ఇంకా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా ప్రాజెక్టు అధికారులు మూడు రేడియల్ గేట్లు రెండు మీటర్లు ఎత్తి కిందికి నీటిని విడుదల చేస్తున్నారు. ముందు జాగ్రత్తగా ప్రాజెక్టు అధికారులు మొత్తం 23గేట్లలో మూడు రేడియల్ గేట్లు రెండు మీటర్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 175అడుగులు(45.77 టీఎంసీలు)కాగా, మంగళవారం రాత్రి 9గంటల వరకు 165.123 అడుగులుగా(31.7965 టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి ఇన్‌ఫ్లో 2,41,285 క్యూసెక్కుల నీరు వస్తుండగా, రేడియల్ గేట్ల ద్వారా 47,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు ఎడమ వైపు ఉన్న విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పాదన కొనసాగుతుంది. పులిచింతల విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యం 120 యూనిట్లు కాగా, నాలుగు యూనిట్ల నుంచి 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు. విద్యుత్ ఉత్పాదనకోసం 18,000 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు మొహినుద్దీన్, ఈఈ గుణకర్‌రావు, డీఈ సంతోష్, జేఈ ఆసియా పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చింతలపాలెం మండలంలోని కృష్ణానది తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు గేట్లు పూర్తిస్థాయిలో ఎత్తడంతో దిగువ ప్రాంతానికి మండలంలోని పులిచింతల ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుండడంతో పులిచింతల తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చేపల వేటకు నదిలోకి వెళ్లొద్దన్నారు.

తగ్గిన ఇన్‌ఫ్లో.. మూసీ క్రస్ట్‌గేట్ల మూసివేత

కేతేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో నాలుగు రోజులుగా ఎత్తి ఉంచిన రెండు క్రస్టుగేట్లను అధికారులు మూసి వేశారు. ఎగువ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో విస్తారంగా కురిసిన వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో గత శుక్రవారం ప్రాజెక్టు 3వ, 8వ నెంబరు క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలో ఎగువన వర్షాలు లేకపోవడంతో సోమవారం సాయంత్రం నుంచి క్రమంగా ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. దీంతో అధికారులు సోమవారం రాత్రి పొద్దుపోయాక 8వ నెంబరు క్రస్టుగేట్‌ను మూసేశారు. మంగళవారం ఇన్‌ఫ్లో మరింత తగ్గడం, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేస్తుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం 643 అడుగులకు పడిపోయింది. దీంతో అధికారులు మంగళవారం ఉదయం 3వ నెంబరు క్రస్టుగేట్‌ను సైతం మూసివేశారు. ఎగువ నుంచి వస్తున్న 953 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో అధికారులు ప్రాజెక్టు నీటిమట్టాన్ని క్రమంగా 645 అడుగులు (4.46టీఎంసీలు) గరిష్ఠస్థాయికి చేర్చే యత్నాలు చేస్తున్నారు.

నేడు డిండి ప్రాజెక్టు నీటి విడుదల

డిండి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నేడు డిండి ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయనున్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ బుధవారం విడుదల చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



టెయిల్‌పాండ్ వద్ద కృష్ణమ్మ అందాలు

టెయిల్ పాండ్ నుంచి కృష్ణమ్మ పరవళ్లు

అడవిదేవులపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అడవిదేవులపల్లికి చేరువలో ఉన్న టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో సుమారు 2,38,468 క్యూసెక్కులుగా వస్తోందని ఏడీ జయశంకర్ తెలిపారు. టెయిల్‌పాండ్ నుంచి ప్రాజెక్టు నుంచి 11 క్రస్ట్ గేట్లు 3.5 మీటర్లు, మూడు క్రస్ట్ గేట్లు 2.5మీటర్లు ఎత్తి 2,36,727 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. టెయిల్‌పాండ్ నీటి నిల్వ సామర్థ్యం సుమారు 7.080 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.764 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

బాక్సింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



నార్కట్‌పల్లి : విద్యార్థులను సన్మానిస్తున్న మేడి హరికృష్ణ

నార్కట్‌పల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల విద్యార్థికి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం లభించింది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో 67-70 కిలోల విభాగంలో పాఠశాకు చెందిన చింతమల్ల నిపుణ్ బంగారు పతకం సాధించారు. ఆగస్టు 7 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్ గ్రేటర్ నోయిడాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు, ఇదే పాఠశాలకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు గౌతమ్, నికర చక్రసేనలు కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

● మిర్యాలగూడ టౌన్ :మిర్యాలగూడ పట్టణంలోని సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావత్ కృష్ణనాయక్ తెలిపారు. ఈ నెల 25న షేక్‌పేటలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. 61-65 కిలోల విభాగంలో తమ విద్యార్థి పి.సాయిసిద్దార్థ (10వ తరగతి)బంగారు పతకం సాధించగా, 49-52 కిలోల విభాగంలో డీ.దేవ వెండి పతకం పొందినట్లు చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుల సమక్షంలో ఇరువురిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఆంజనేయులు, పీఈటీ ఏకస్వామి తపాల్గొన్నారు.

కరాటే పోటీల్లో శివరాజ్‌కు ప్రథమ స్థానం



శాలిగౌరారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరిలో ఈ నెల 26,27 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలలో నల్లగొండ జిల్లా అడ్లూర్ గ్రామానికి చెందిన వరికుప్పల శివరాజ్ ప్రథమ స్థానం పొందారు. వివిధ రాష్ట్రాల నుంచి 1500 మంది కరాటే విద్యార్థులు పాల్గొనగా అడ్లూర్ నుంచి అవినాష్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ నుంచి వరికుప్పల శివరాజ్ పాల్గొన్నారు. ఇందులో కటాస్ స్పారింగ్ పోటీలు నిర్వహించగా అండర్ 21 విభాగంలో శివరాజ్ మొద టి స్థానంలో సాధించగా ఛాంపియన్‌షిప్ ట్రోఫీని, ప్రశంస పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా శివరాజ్‌ను పలువురు అభినందించారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం నాగవల్లి దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లి దళార్చనలు నిర్వహించి హారతి నివేదించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయ స్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.14,96,072 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్‌రావు తెలిపారు.

వైభవంగా నాగుల పంచమి

యాదగిరిగుట్ట, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఘాట్‌రోడ్డులో భక్తులు నాగుల పంచమి వైభవంగా నిర్వహించారు. ఉదయం పుణ్యస్నానాలు ఆచరించిన మహిళా భక్తులు మొదటి ఘాట్ రోడ్డు వద్ద పసుపు, కుంకుమ చల్లి పూలు, పండ్లు సమర్పించి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

అత్యవసర ఉత్తర్వులు

ప్రోటోకాల్ పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు వేములవాడ ఆలయంలో రిపోర్టు చేయాలని దేవాదాయ కమిషనర్ వెంకట్‌రావు అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. సదరు అధికారి గతేడాది ఆగస్టులో బదిలీపై వేములవాడకు వెళ్లి డిప్యూటేషన్‌పై తిరిగి నెల రోజుల్లోనే ఇక్కడి ఆలయంలో విధుల్లో చేరారు. మళ్లీ వేములవాడకు వెళ్లాలని ఈ నెల 26న ఉత్తర్వులు జారీ కాగా బదిలీని నిలుపుదలకు గడిచిన మూడు రోజులుగా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్థానికంగా చర్చనీయమైంది.

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో మంగళవారం శ్రీరాజలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తదుపరి కల్యాణమూర్తులను పరిణ వేదికపైకి అధిష్ఠింపజేసి పుణ్యాహవాచనం చేశారు. పాదప్రక్షాళనం, మధుపర్క పూజలు యథావిధిగా చేపట్టారు. మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణ అనంతరం గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్గదర్శకులు తల్లిదండ్రులే

- భువనగిరి డీఈవో సత్యనారాయణ
- మోత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ



జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ చేసి పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

మోత్కూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు మార్గదర్శకులు తల్లిదండ్రులేనని యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ అన్నారు. మోత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి ప్రార్థించారు. విద్యార్థుల చేత తల్లిదండ్రుల కాళ్లు కడిగించి పాద పూజ చేయించారు. ఈ యేడాది పాఠశాలలో నూతనంగా చేరిన, ఇప్పటికే పాఠశాలలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను 350 మందిని శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. విద్యార్థులు తల్లిదండ్రులను ముద్దు పెట్టుకుని తమ ఆనందాన్ని వ్యక్త పర్చారు. డీఈవో విద్యార్థులపై అక్షింతలు, పూలు చల్లి ఆశీర్వదించారు.వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయుల బోధన కన్నా తల్లిదండ్రుల ప్రవర్తనే విద్యార్థుల భవిష్యత్‌పై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. తల్లిదండ్రుల్లో మార్పు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక విలువలు నేర్చుకుంటారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సన్మానానికి మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం కోక బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోక భిక్షపతి శాలువాలు అందించి సహకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్, దాత డాక్టర్ కోక భిక్షం, తిరుమలగిరి పాఠశాల హెచ్‌ఎం దామెర శ్రీనివాస్, ఏపీసీ చైర్‌పర్సన్ దబ్బెటి శైలజ, పాఠశాల పూర్వ విద్యార్థులు అవిశెట్టి అవిలిమల్లు, గుజ్జ సోమ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధురాలు దొడ్డా పద్మ మృతి



దొడ్డా పద్మ (ఫైల్)

చిలుకూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య సతీమణి దొడ్డా పద్మ(98)మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. హై దరా బాద్‌లోని బంజారాహిల్స్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. బుధవారం చిలుకూరులో ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతికి వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

బస్ టైర్ పంక్చర్.. కాలినడకన విద్యార్థులు



కాలినడకన సూర్యాపేటకు వెళ్తున్న మోడల్ విద్యార్థులు

పెన్‌పహాడ్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజిపురం మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజు సూర్యాపేట నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చి సాయంత్రం అదే బస్సులో సూర్యాపేటకు వెళ్తుంటారు. ఈక్రమంలో మంగళవారంకూడా పాఠశాల ముగిసిన తర్వాత 5గంటల తర్వాత ఆర్టీసీ బస్సులో బయలు దేరారు. అయితే బస్సు మార్గమధ్యలో తాళ్లఖమ్మపహాడ్ సమీపంలో పంక్చర్ అయింది. దీంతో దిక్కుతోచని విద్యార్థుల స్కూల్ ఉపాధ్యాయులకు ఫోన్ చేశారు. వారు స్పందించకపోవడంతో కాలినడకన దాదాపుగా 8 కిలోమీటర్లు సూర్యాపేటకు బయలు దేరారు.

రేపు స్పాట్ అడ్మిషన్

నార్కట్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల (కట్టంగూర్) చిన్ననారాయణపురంలో ఈ విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శమంతకమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఎంపికైన వారికి ఈట్లను కేటాయిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్



శాలిగౌరారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా నిమ్మల సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా తాటిపాముల హేమాద్రి, ప్రధాన కార్యదర్శిగా కంది వీరసోము ఏక గ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్న గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చాడ హరీష్‌రెడ్డి, గుజిలాల్ శేఖర్‌బాబు, కల్లూరి నాగరాజుగౌడ్, బట్ట వీరబాబు, బండారు మహేష్, రాపాక రాజు ఉన్నారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

● నల్లగొండ ఏవో శ్రీనివాస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



యూరియా వాడకంలో రైతులు అవగాహన పెంచుకొని యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అధికంగా యూరియా వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని అవసరం మేరకే ఎరువులు వాడాలని నల్లగొండ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

ఆంధ్రజ్యోతి: పంటలకు ఏ మేరకు యూరియా వాడాలి?

ఎంఏవో: యూరియా తక్కువ వాడటం వల్ల ఖర్చు తక్కువ రావడంతో పాటు అధిక దిగుబడులు కూడా వచ్చే అవకాశముంటుంది. యూరియా 46శాతం నత్రజని కలిగిన అత్యంత శక్తివంతమైన ఎరువు. తేలికగా నీటిలో కరిగి మొక్కకు అందుబాటులోకి వస్తుంది.

ఆంధ్రజ్యోతి: యూరియా ఎక్కువగా వాడితే ఏమవుతుంది?

ఎంఏవో: విపరీతంగా యూరియా వాడకం వల్ల వరి పైరు ఎత్తు పెరిగి ఒరిగి పోతుంది. పంటలో కలుపు కూడా పెరిగి తాలు గింజలు ఏర్పడతాయి. అధికంగా యూరియా వాడితే పంట చేలకు, చీడ పీడల బెడద సులభంగా చేరి పంటలు దెబ్బతింటాయి. అధికంగా వాడితే రైతుపై ఆర్థికంగా భారం పడి దిగుబడులు కూడా తగ్గిపోతాయి.

ఆంధ్రజ్యోతి: రైతులు లాభం పొందాలంటే యూరియా ఎలా వాడాలి?

ఎంఏవో : పైరుకు నత్రజని అవసరం మొదటి నుంచి చివరి వరకు ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని 3నుంచి 4 దఫాలుగా యూరియా వేయాలి. యూరియా వేసేటప్పుడు తేమ ఉండేలా చూసుకోవాలి. వరి నాట్లు వేసినప్పుడు పిలక దశలో, చిరు పొట్ట దశలో వేయాలి. అదేవిధంగా నీరు తీసివేసి బురద పదును మీద చల్లి 24గంటల నుంచి 48 గంటల తరువాత నీరు పెట్టాలి.

ఆంధ్రజ్యోతి: యూరియా వృథాను ఎలా అరికట్టాలి?

ఎంఏవో : మెట్ట పైర్లలో యూరియా వెదజల్లడం కాని మొక్క పక్క గుంతలో వేసి మట్టి కప్పడం వల్ల యూరియా వృథాను అరికట్టవచ్చు. యూరియా వేప పిండి వేసుకుంటే నత్రజని సామర్థ్యం పెరుగుతుంది. అదేవిధంగా చీడపీడలను అరికడుతుంది. రైతులు తక్కువ పెట్టుబడులతో మంచి యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి.

మురిపించి.. జాడలేని వర్షాలు

● వర్షాభావంతో నిండని చెరువులు, కుంటలు ● వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా అరకొర వర్షాలే



ఎండిపోయిన కేతేపల్లి చెరువు

కేతేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అరకొరగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వివిధ గ్రామాల్లోని చిన్న నీటివనరులైన చెరువులు, కుంటలు నీరులేక వెలవెలబోతున్నాయి. మే, జూన్ నెలల్లో వర్షాలు కురిసినా ఆ తర్వాత వాన జాడలేకుండా పోయింది. దీంతో వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా మండలంలోని మూసీ ఆయకట్టేతర గ్రామాలుగా ఉన్న ఇనుపాముల, కొర్లపహాడ్, గుడివాడ, ఇప్పలగూడెం, కేతేపల్లి, బండపాలెం, కొండకిందిగూడెం గ్రామాల చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులు, కుంటల్లోకి నీరు చేరకపోవడంతో రైతుల్లో వ్యవసాయం పట్ల నైరాశ్యం అలముకుంది. మండలంలో జూన్ నెలలో 92.1మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 68.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో జూన్‌లో 23.5 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. జూలైలో 164 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 28.1 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. గత జూన్ నెల చివర్లో వచ్చిన అరకొర వర్షపు జల్లులకు కొందరు రైతులు రెండు, మూడుసార్లు విత్తనాలు పెట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాభావ పరిస్థితిని నల్ల రేగడి భూముల్లోని పత్తి మొలకలు తట్టుకుంటున్నా పెరుగుదల లోపించింది. ఇక ఎర్ర నేలల్లో మొలిచిన పత్తి మొక్కలు వేడి గాలులకు వాడిపోతున్నాయి. ఇటీవల మూడు, నాలుగు రోజుల పాటు ముసురు జల్లులు కురిసినా ఎక్కడా చెరువుల్లోకి నీరు మాత్రం చేరలేదు. ముసురు జల్లులు ఎండిపోయే దశలో ఉన్న పత్తి పంటకు మాత్రం జీవం పోసినట్లయింది. సరైన వర్షం కురవక పోవడంతో వాగులు, వంకలు ఎండిపోయాయి. వ్యవసాయ బోర్లు, బావుల్లో నీరు అడగంటిపోయింది. దీంతో చెరువులు, కుంటల ఆయకట్టులో వరి సాగుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీన మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంతో ఆయకట్టు గ్రామాల చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



దర్వేశిపురం ఆలయం వద్ద భక్తుల రద్దీ

నల్లగొండ, కనగల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాగుల పంచమిని పురస్కరించుకుని మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్దగల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మం గళవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున ఆలయా నికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పుట్టలో పాలు పోసి, నాగ పడిగలకు పసుపు కుంకుమలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు నెరవేరాలని వేప కొమ్మలకు ముడుపులు కట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అర్చకులు ఉదయం అమ్మవారికి విశేష అలకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి ఏర్పాట్లు చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆలయాల్లో నాగుల పంచమి సందర్భంగా పూజలు నిర్వహించారు.



నల్లగొండలోని పాము పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గట్టుప్పల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, ఇంటిపన్నుల డిమాండ్ నోటీసులు ఇతరత్రా అంశాలపై సూచనలు చేశారు. అనంతరం గట్టుప్పల్ జీపీలోని కంపోస్టుషెడ్‌ను సందర్శించారు. ఎరువు తయారీ, పొడి చెత్త పేరు చేస్తున్న తీరును పరిశీలించారు. అన్ని గ్రామపంచాయతీల్లో కూడా ఇదేవిధంగా కంపోస్ట్‌షెడ్డు ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.మాధవరెడ్డి పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లోని కంపోస్ట్‌షెడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

ప్రతిష్ఠా విగ్రహాలకు ధాన్యాధివాసం



ప్రతిష్ఠాపిత విగ్రహాలకు ధాన్యాధివాసంలో పాల్గొన్న ఉత్సవ నిర్వాహకులు

నార్కట్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని అశోక్ స్వామి నిర్మించిన దేవాలయాల్లో రేణుకా ఎల్లమ్మ, కాళికామాత, శివలింగం, మహాగణపతి నూతన విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ప్రతిష్ఠాపిత విగ్రహాలకు ధాన్యాధివాసం చేశారు. అంతకుముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యజ్ఞశాలలో రుత్వికులు శాంతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సిద్ధాంతి బేతోజు సత్యనారాయణ, ఉత్తరాపల్లి నర్సింహ్మాచార్యుల యాజ్ఞికంలో కొనసాగుతున్న ఈ విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమంలో గురుస్వామి అశోక్, శాపల్లి మాజీ సర్పంచ్ సిద్ధగోని స్వామిగౌడ్, పసునూరి శ్రీనివాస్, వడ్డేగోని రామలింగం దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయ వేలం రూ.75లక్షలు

నార్కట్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం గుట్టపై టెంకాయల విక్రయ వేలం రూ.75,55,555లు పలికింది. ఏడాది కాలపరిమితికి గుట్టపై కొబ్బరికాయల విక్రయ వేలం హక్కు పొందేందుకు మంగళవారం గుట్టపై సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ముగ్గురు వేలం దారులు పాల్గొన్నారు. సీల్డ్ టెండర్‌లో ఎల్లారెడ్డిగూడేనికి చెందిన కల్లూరి శివకుమార్ అత్యధికంగా రూ.75,55,555లకు పాడి వేలం హక్కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, పర్యవేక్షకుడు తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, పరిశీలకుడు సంతోశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది గోదల మహేందర్, రాంబాబు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

నార్కట్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): గురుకులాలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని యువజన నాయకుడు వడ్డేపల్లి నాగరాజు కోరారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేశ్, చార్య పీఎల్ విశ్వేశ్వర్ రావులకు మార్గమధ్యలో నార్కట్‌పల్లిలో వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించాలని గురుకులాల్లో సమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. త్వరలో గురుకులాలను సందర్శించి వాటి ద్వారా మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వానికి సూచనలు చేస్తామని కమిషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి నాగరాజు, ఎస్కే జానీ, బోడ నవీన్, ముప్పిడి కుమార్, కొత్తూరు నవీన్, బోడ రాఖీ తదితరులు ఉన్నారు.

క్షౌరవృత్తిపై పేటెంట్ హక్కులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

చిట్యాల, జూలై 29,(ఆంధ్రజ్యోతి): క్షౌరవృత్తిపై నాయీబ్రాహ్మణులకు పేటెంట్ హక్కులు కల్పించాలని నాయీబ్రాహ్మణ సేవాసంఘం మండల అధ్యక్షుడు అంశాల అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల కులవృత్తి చేయడానికి ఇతరులకు అనుమతించవద్దని కోరారు. నాయీబ్రాహ్మణులకు ఎస్సీలకు వర్తించే అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. 50ఏళ్ల నిండిన వారికి వృద్ధాప్య పించన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంశాల శ్రవణ్‌కుమార్, అమరోజు వెంకటేశం, చికిలంమెట్ల అశోక్, అంశాల సత్యనారాయణ, మునుగోటి మహేష్, జంపాల వెంకన్న, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

102 అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులు బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సూర్య శిల్పి

శాలిగౌరారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు 102 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ సూర్య శిల్ప కోరారు. 102అంబులెన్స్ సేవలపై మంగళవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం, శనివారం మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లి గర్భిణులు, బాలింతలను శాలిగౌరారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకవచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య పరీక్షల అనంతరం వారికి మందులు ఇచ్చి సురక్షితంగా ఇంటికి చేరుస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్ దయామణి, మరియా, 102అంబులెన్స్ పైలెట్ బోడిగే రమేష్, పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



పెద్దకాపర్తి శివారులో జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

చిట్యాలరూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని పెద్దకాపర్తి శివారులో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండకు చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి కారులో నల్లగొండకు బయలుదేరారు. పెద్దకాపర్తి శివారు వరకు చేరుకోగానే కారులో అకస్మాత్తుగా షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు వచ్చాయి. కారులో ఉన్న వారు వెంటనే అప్రమత్తమయ్యారు. లాక్ కూడా వెంటనే తెరచుకోవడంతో కారులో ఉన్న వారు డోర్లు తీసి పక్కకు పరుగెత్తారు. మంటలు చిన్నచిన్నగా కారు మొత్తం వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. పెద్దకాపర్తి గ్రామస్థులు, వాహనదారులు కారుపై నీటిని చల్లారు. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. నల్లగొండలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మరో కారు తెప్పించి అందులో వెళ్లారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

నల్లగొండ క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని బస్టాండు సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఆ విద్యార్థిని మధ్యాహ్న సమయంలో మృతిచెం దినట్లు సమాచారం. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి విచారణ చేపట్టారు. రాత్రి 10 గంటల వరకు కూడా పూర్తి వివరాలు తెలియరాలేదు. మృతురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు తర్వాత విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ ఎర్ర సైదులు తెలిపారు.

ఇందిరమ్మ నమూనా ఇల్లు రెడీ

కేతేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలకేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మూడు నెలల క్రితం తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో రూ.5లక్షల వ్యయంతో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండు గదులు, కిచెన్, సెల్ఫ్‌లతో కూడిన ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రంగులు సైతం వేయడంతో దాన్ని ప్రారంభించడమే తరువాయి.



చట్టాల పరిరక్షణకు కార్మికులు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు

నల్లగొండ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన పౌరసరఫరాలశాఖ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను కుదించి, శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా, కేంద్రం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు లేవని, హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ, హమాలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, నూతన గోదాములు నిర్మించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, నాయకులు బి.మహేష్, దొనకొండ వెంకన్న, నాగరాజు, అశోక్, కృష్ణయ్య, రఘు, శ్రీనివాసులు, రవి, శ్రీశైలం, రమేష్, శివ, ధర్మతేజ, లింగం, నాగార్జున, లింగస్వామి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ సేవలు మరింత ప్రియం

(5వ పేజీ తరువాయి)



9,59,445 ఉన్నాయి. అందులో సూర్యాపేట జిల్లాలో 2,02,181, నల్లగొండ జిల్లాలో 5,14,675, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 2,42,589 ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరిలలో రవాణా శాఖ కార్యాలయాల సేవలు అందుతున్నాయి. ఈ కార్యాలయాల్లో ప్రతి రోజూ పెద్దసంఖ్యలో వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, పర్మిట్లు జారీ చేయడం, ఎన్‌వోసీలు, ఇంకా వివిధ రకాల సేవలందిస్తున్నారు.

ప్రతి రోజూ రూ.లక్ష భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ పెంచిన చార్జీలతో వినియోగదారులపై రూ.లక్ష వరకు భారం పడుతోంది. ప్రతి రోజూ లైసెన్సుల కోసం 200 వస్తుంటాయి. వాటిపై సుమారు రూ.20,000 వేలు అదేవిధంగా 150 నుంచి 200 వరకు రిజిస్ట్రేషన్స్ జరుగుతుండగా వాటిపై రూ.15,000, హైపోథికేషన్‌పై రోజుకు రూ.30,000, పర్మిట్లు, ఫిట్‌నెస్‌లకు రూ.10,000, ఇతర సేవలకు సంబంధించి రూ.25,000 వరకు అదనపు భారం పడుతోంది. సరాసరిన రూ.లక్ష వరకు భారం వినియోగదారుడు చెల్లించాల్సి వస్తుండగా, ఏడాదికి సుమారు రూ.3 కోట్ల వరకు ఉండనుందని అంచనా వేస్తున్నారు.

నీటి వృథా.. అరికట్టేదెలా?

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకై నీరు వృథాగా పంట పొలాల్లోకి పోతున్నాయి. మర్రిగూడ మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామ మధ్య నర్సింపురం గ్రామ గేటు రోడ్డు సమీపంలోని ఓ రైతు పొలంలో మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ లీకేజీ వారం రోజుల నుంచి నీరు పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మెయిన్ పైప్‌లైన్ మరమ్మతులకు నోచక నీరు పంట పొలాల్లోకి వెళ్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీ అవుతున్న మెయిన్ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మర్రిగూడ




మిషన్‌భగీరథ పైపులు లీకై పంట పొలాల్లోకి వెళ్తున్న నీరు

బోనం.. విద్యార్థుల సంబురం



చిట్యాలలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థులు బోనాలు తయారు చేశారు. దుర్గామాత వేషధారణ, పోతురాజుల విన్యాసాలతో అలరించారు.

● ఆంధ్రజ్యోతి, చిట్యాల



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587 (305.8626)	2,48,235	2,55,811
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.00 (3.94)	953.00	620.46
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.123 (31.9765)	2,41,285	47,698

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

సాగర్ నుంచి.. సాగరానికి



సాగర్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కృష్ణమ్మకు వాయినం సమర్పిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్

ఆధునిక దేవాలయం నాగార్జునసాగర్ జలాశయం నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు ప్రారంభమయ్యాయి. ఎగువనుంచి 2,55,811 క్యూసెక్కులనీరు సాగర్‌కు వచ్చి చేరుతుండగా, సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండటంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11.28 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనారిటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్విచ్‌ఆన్‌చేసి నీటి విడుదలను ప్రారంభించారు.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

7

అర్హులకు రేషన్‌కార్డులు



పెద్దవూరలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

మంత్రులు అడ్లూరి, ఉత్తమ్

పెద్దవూర, కట్టంగూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు పంపిణీచేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పెద్దవూర, కట్టంగూర్ మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, వేముల వీరేశంతో కలిసి నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు అందించి కడుపు నింపాలన్నదే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 97లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా 84 శాతం జనాభా 3.15కోట్ల మంది సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, ఇక ముందు కూడా అర్హులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. రెండు సీజన్లుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టాన్ని చేరుకోవడం అదృష్టమన్నారు. గత ఏడాది రెండు సీజన్లు కలిపి 2.81కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తూ, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నది ఒక్క తెలంగాణేనన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు, ఇంటిని నిర్మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదలకు ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. సాగర్ నియోజకవర్గానికి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఇప్పటికే 72,284 రేషన్ కార్డులు ఉండగా, కొత్తగా 8,231 కార్డులు ఇచ్చామన్నారు. జిల్లాలో కొత్తగా 62,700 రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తిచేస్తామన్నారు. రేషన్‌షాపు నిర్వాహకులకు ఇచ్చే కమీషన్‌కు సంబంధించిన ఫైలను సమర్పించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్‌ను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్.చౌహాన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పెద్ద సుక్కయ్య, శంకర్, నర్సింహ, యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పేరుతో భయపెడితే చర్యలు



రూ.18లక్షల చెక్కును అందజేస్తున్న మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రులు డెంగీ పేరుతో భయభ్రాంతులకు గురిచేయవద్దని, అలాచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. డెంగీ పేరుతో కొన్ని ఆస్పత్రులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా మరోసారి జ్వర సర్వేను నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు పాఠశాలలను, హాస్టళ్లను తప్పనిసరిగా సందర్శించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.18లక్షల సాయం అభినందనీయం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): టీబీ కేసులను అప్పటికప్పుడే నిర్ధారించే పరికరాలకోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.18లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మొబైల్ టీబీ ఎక్సరే పరికరం కోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌కు రూ.18లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీనివాస్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంటా సంతోష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, నల్లగొండ సంఘం అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి భద్రాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభ్యున్నతికి తోడ్పడాలి

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి 6

రవాణా శాఖ సేవలు మరింత ప్రియం

» వాహన రిజిస్ట్రేషన్, లైసెన్స్ చార్జీలను పెంచిన ప్రభుత్వం » 50 నుంచి 100 శాతం పెరిగిన చార్జీలు » ఉమ్మడి జిల్లాలో అదనపు భారం రోజుకు రూ.లక్ష, ఏడాదికి రూ.3 కోట్లకు పైనే

రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖ ద్వారా అందించే సేవల చార్జీలను గుట్టుచప్పుడు కాకుండా పెంచింది. ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో రవాణాశాఖ అందించే వివిధరకాల సేవల చార్జీలను అమాంతం పెంచింది. ఒక్కో సేవకు ప్రస్తుత చార్జీలపై 50 నుంచి 100 శాతం పెంచింది. దీంతో వాహనదారులు ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాంటి సమాచారం లేకుండా ఆన్‌లైన్‌లో పెంచిన చార్జీలను అప్‌లోడ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ వివిధ సేవలకు గాను గతం కంటే రూ.లక్ష అదనం గా వినియోగదారులు భరించాల్సి వస్తోంది. ఏడాదికి సుమారుగా రూ.3 కోట్ల భారం పడుతోంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)



రవాణా శాఖ చార్జీలు సవరించి సుమారు ఎనిమిదేళ్లు దాటడంతో పెంచినట్లు సమాచారం. పెరిగిన చార్జీలు ఈ నెల 28 నుంచి అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా వాహనాల రిజిస్ట్రేషన్, హైపోథికేషన్, వాహన యాజమాన్య బదిలీ, ఆర్సీల రెన్యూవల్, ఒక ప్రాంతం చిరునామా నుంచి మరో ప్రాంత చిరునామాకు వాహనాల బదిలీలకు సంబంధించిన క్లియరెన్స్ సర్టిఫికెట్లు, ఎన్‌వోసీల జారీకి చార్జీలను రూ.100 నుంచి రూ.వేలలోకి పెంచారు. అంతకు ముందు వివిధరకాల సేవల కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి రవాణాశాఖ కార్యాలయాల్లోకి వెళ్లిన సందర్భాల్లో పెరిగిన చార్జీలు భారంగా మారాయి. గతంలోని చార్జీలతో స్లాట్ బుక్ చేసుకున్న వారు వారికి కేటాయించిన తేదీల్లో కార్యాలయాల్లోకి వెళ్లగానే పెంచిన చార్జీలు అమలులో ఉంచడంతో మిగిలిన మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 9 లక్షలకు పైగా వాహనాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్నిరకాల వాహనాలు కలిపి...

మిగతా 8వ పేజీలో...

అమలులో పెరిగిన చార్జీలు

రవాణా శాఖ ద్వారా వాహనదారులకు అందించే వివిధ రకాల సేవల చార్జీలను ఇటీవల ప్రభుత్వం పెంచింది. పెరిగిన చార్జీలు అమలులోకి వచ్చాయి. వాహనదారులు పెరిగిన ఆ చార్జీలు చెల్లించి రవాణా శాఖ సేవలు పొందాల్సి ఉంది. గతంలో స్లాట్ బుక్ చేసుకున్న వారు పెరిగిన చార్జీల ప్రకారమే మిగిలిన డబ్బును చెల్లించాల్సి ఉంటుంది. రవాణా శాఖ ద్వారా వాహనదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం.

-డాక్టర్ వాణి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, నల్లగొండ.

పెరిగిన చార్జీల వివరాలు

రవాణా శాఖ ద్వారా వాహనదారులకు అందించే వివిధరకాల సేవలకు సంబంధించి చార్జీలు వివరాలు ఇలా ఉన్నాయి.

సేవలు	ప్రస్తుత చార్జీలు	పెరిగినవి
బైక్ లెర్నింగ్	రూ.300	రూ.350
పర్మినెంట్ లైసెన్స్	రూ.1335	రూ.1450
(బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాలకు)		
యాజమాన్యబదిలీ	రూ.935	రూ.1805
హైపోథికేషన్	రూ.2135	రూ.3135
రిజిస్ట్రేషన్ చార్జి (రవాణేతర బైక్‌లకు)	రూ.200	రూ.210
(ఇతర వాహనాలకు)	రూ.400	రూ.440
ఆటో రిక్షా ఆర్సీ	రూ.150	రూ.250
ఆటోరిక్షా పర్మిట్	రూ.100	రూ.200

ఎన్నికల హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేస్తామని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని విమర్శించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు సెలవు ఇవ్వకుండా స్పెషల్ ఆఫీసర్ల వేధిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు దుస్తులు, సబ్బులు, చెప్పులు నూనె, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోలే సాంబయ్య, సీఐటీయూ నాయకులు పెంజర్ల సైదులు, పొన్న అంజయ్య, గండమల్ల ఆశీర్వాదం, ఎండి. జహీర్, పి.సర్వయ్య, ఎర్ర అరుణ, కె.నరసయ్య, ఎన్.నరసింహ, రమేష్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవా రం పట్టణంలోని ప్రకాష్‌నగర్ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి విభాల్లో సిబ్బంది పనితీరును పర్యవేక్షించి రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో మందుల వివరాలను తెలుసుకొని స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. కలరా, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలకుండా పాటించాల్సిన వ్యక్తిగత జాగ్రత్తలపై ప్రజలకు అవగాహ న కల్పించాలన్నారు. ఆస్పత్రి పరిధిలోని 13 పా ఠశాలలు, హాస్టళ్లను వైద్యసిబ్బంది సందర్శించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు తప్పనిసరి రక్త పరీక్షలు చేయించాలన్నారు. పట్టణంలో పారిశుధ్యలోపాలను గుర్తించి మునిసిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనవెంట డిప్యూ టీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేసా రవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిపుణ్, ఎన్‌సీడీ వేణుగోపాల్‌రె డ్డి, టీబీ నియంత్రణ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి, సూపర్‌వైజర్ ప్రమీల, ఫార్మసిస్ట్ మౌనిక, ఎల్ టీ కళ్యాణి, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు

నల్లగొండ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పోరాడే ఏకైక సంఘం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ అని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు మేలు జరుగుతుందంటే అది 1104 యూనియన్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగులను ముందుండి నడిపించామన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యమంలో పెద్దన్న పాత్ర పోషించామన్నారు. ప్రత్యేక ఒప్పంద విధి విధానాలను పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్కిల్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.జైపాల్‌రెడ్డి, నిమ్మచెట్ల వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్, అదనపు సెక్రటరీలుగా కె.శ్రీనివాసులు, ఎల్.సత్యనారాయణలు ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ అధ్యక్షుడు కె.రాజేందర్, అదనపు కార్యదర్శి జి.వరప్రసాద్, సలహాదారుడు ఆర్.జనార్ధన్‌రెడ్డి, ఎస్ఈ ఎ.వెంకటేశ్వర్‌రావు, టెక్నికల్ డీఈ కృష్ణారావు, ఎస్ఏవో సుచేందర్, సీఈ అన్నయ్య, సీహెచ్.విద్యాసాగర్‌రావు, బి.వెంకటయ్య, ఎం.శ్రీనివాసచారి, డి.ప్రభాకర్, కె.వేణు, ఎన్.వెంకన్న, ఎస్.భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎన్.సీతారాములు, మేరెడ్డి రాంరెడ్డి, శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సకాలంలో అందించాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్లు సకాలంలో అందించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరందాసు విష్ణు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వృద్ధ, దివ్యాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్లు నెలాఖరులో ఇవ్వడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ. 4వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

బీజేపీ విజయానికి కృషి చేయాలి

చందంపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ మండల ప్రచారి ఏటి కృష్ణ అన్నారు. మండలంలోని పోలే పల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమా వేశంలో ఆయన మాట్లాడారు.సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినోద చారి, పాత్లావత్ ఆంజనేయులు, శివకృష్ణ, మట్టెపల్లి అనిల్, సుక్య పాల్గొన్నారు.

ఘనంగా నాగులపంచమి పూజలు



దేవరకొండ శివారు బ్రాహ్మణ ఎల్లమ్మకుంట వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

దేవరకొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాగులపంచమి వేడుకలు పలు మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. దేవరకొండ పట్టణంలోని భక్తమార్కండేయస్వామి ఆలయం సమీపంలోని బ్రాహ్మణ ఎల్లమ్మ కుంట వద్ద శ్రావణ శుద్ధ పంచమిని పురస్కరించుకుని పూజలు చేశారు. మంగళవారం మహిళలు ఆలయం సమీపంలోని కుంట వద్దకు చేరుకొని పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ కాలసర్ప దోషాలు ఉన్నవారు సుబ్రహ్మణేశ్వర, రేణుకా ఎల్లమ్మ, భవాని మృత్యునుజేశ్వర, దుర్గామాత అమ్మవార్లకు పూజలు చేస్తే దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

● చింతపల్లి : మండలంలోని వేంకటేశ్వరనగర్, చింతపల్లి, ఎం.మల్లేపల్లి, కుర్మపల్లి, తదితర గ్రామాల్లో మహిళలు ఆలయాల్లో పూజలు చేశారు. ప్రధానంగా వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మహిళలు సామూహికంగా ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలో పుట్టలో పాలు పోసి సౌభాగ్యంగా ఉండాలని మహిళలు తెలిపారు.



నాగార్జునసాగర్: సత్యనారాయణ స్వామి ఆలయ పూజలో పాల్గొన్న మహిళలు

● నాగార్జునసాగర్ : స్థానిక హిల్‌కాలనీ సత్యనారాయణ స్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు అధిక ఎరుపు, పసుపు దుస్తులు ధరించి భక్తి శ్రద్ధలతో కలశ స్థాపన, మంగళ గౌరీ పూజ, 108 సార్లు లలిత సహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

● హాలియా : హాలియా స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న అనంతనాగ దేవతకు పంచామృతభిషేకం, అష్టో త్తర శతనామార్చనలు, పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు. కార్యక్రమంలో హాలియా పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

● రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ



ఇంటర్వ్యూ Interview

అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందజేస్తామని, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 11,736 కొత్త రేషన్‌కార్డులను అందజేస్తున్నట్లు మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. (ఆంధ్రజ్యోతి- దేవరకొండ)

ఆంధ్రజ్యోతి: నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తులు ఎప్పటివరకు స్వీకరిస్తారు?

ఆర్డీవో: దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. అర్హులందరూ రేషన్‌కార్డుల కోసం మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: దేవరకొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎన్ని నూతన రేషన్‌కార్డులు అందజేశారు?

ఆర్డీవో: దేవరకొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు 11,736 కొత్త రేషన్‌కార్డులను అందజేస్తున్నాం. 15,837 మందిని చేర్చి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: భూభారతిలో భూసమస్యలు పరిష్కరిస్తున్నారా?

ఆర్డీవో: భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తుంది. దీంతో సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు భూభారతిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ?

ఆర్డీవో: నియోజకవర్గంలో 9,055 భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులన్నింటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: చందంపేట, పీఏపల్లి మండలాల్లో అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చారా?

ఆర్డీవో: చందంపేట, పీఏపల్లి మండలాలలో సర్వే నిర్వహించి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్న రైతులందరికీ న్యాయం జరుగుతుంది. అసైన్డ్, అటవీ భూములపై సర్వే కొనసాగుతుంది. నిజమైన రైతులకు పట్టాలు అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: భూమి ఒకరిపేరున ఉండి మరొకరి ఆధీనంలో ఉన్న రైతులకు ఎలాంటి న్యాయం చేస్తారు?

ఆర్డీవో: భూభారతి చట్టం ప్రకారం భూమి ఎవరిపేరున ఉందో సర్వే నంబర్ల ఆధారంగా విచారణ చేస్తాం. కాస్తులో ఉన్న రైతులకే న్యాయం జరిగేలా చర్యలు చేపడుతాం. భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీవో రమణారెడ్డి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. చెట్లకింద మధ్యాహ్న భోజనం వండవద్దని, షెడ్లలో వంట చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉన్నారు.

వెల్‌నెస్ హెల్త్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో బాలాజీనాయక్

దామరచర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): బ్యూటీ అండ్ వెల్‌నెస్ హెల్త్ ల్యాబ్‌లు కౌమారదశ బాలికలకు శారీరక వికాసాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో ఎం.బాలాజీనాయక్ అన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో భాగంగా మంగళవారం మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ హెల్త్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక పరికరాలు, అత్యాధునిక సౌకర్యాలతో ప్రత్యేక శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్లతో బాలికలకు శారీరక వికాసాన్ని పెంపొందించే ల్యాబ్‌లు గ్రామీణ ప్రాంత పాఠశాలకు మంజూరు కావడం అభినందనీయమన్నారు. వృత్తి విద్య కోర్సులైన బ్యూటీ వెల్‌నెస్, ఆరోగ్య విద్య కోర్సులు బాలికల బంగారు భవిష్యత్తుకు ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరహరి, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్ కవిత, దుర్గా పాల్గొన్నారు.

ఘనంగా సినారె జయంతి



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి 94వ జయంతిని మండలంలోని జప్తివీరప్పగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గుడిపాటి కోటయ్య సీనారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీనారె తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోని సాహిత్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞానప్రకాశ్‌రెడ్డి సెంచరీ



సత్తా చాటిన జ్ఞానప్రకాశ్‌రెడ్డి

పెద్ద అడి శర్ల పల్లి, జూలై29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ లీగ్‌లో డివిజన్-బీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా క్లాసిక్ జట్టుతో జరిగిన నల్లగొండ జిల్లా జట్టు సభ్యుడైన అలుగుబెల్లి జ్ఞానప్రకాశ్‌రెడ్డి సెంచరీ కొట్టి నల్లగొండ జ ట్టును గట్టెక్కించాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నల్లగొండ జిల్లా జట్టులో వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్‌గా దిగిన జ్ఞానప్రకాశ్‌రెడ్డి 139 బంతులను ఎదుర్కొని 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 151 పరుగులు చేశాడు. దీంతో హెచ్‌సీయూలో సెంచరీ కొట్టి మండలానికి పేరు తెచ్చినందుకుగాను మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కూరాకుల వెంకటయ్యకు నివాళి

కొండమల్లేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన కూరాకుల వెంకటయ్య మృతి బాధాకరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. మంగళవారం వెంకటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కేసాని లింగారెడ్డి, పెద్దిశెట్టి సత్యం, వరికుప్పల పాండు, శ్రీను, శేకర్‌యాదవ్ తదితరులున్నారు

సంప్రదాయ బద్ధంగా సీత్లా పండుగ



హాలియాలో సీత్లా పండుగలో పాల్గొన్న గిరిజన మహిళలు

హాలియా, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది గిరిజనులు ఆనవాయితీ, సంప్రదాయ బద్ధంగా చిన్న పుష్యమి కార్తెలో జరుపుకునే సీత్లా పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. హాలియాలోని గిరిజనులను దేవతలు కరుణించాలని, వర్షాలు కురవాలని, పాడి పంటలతో గ్రామాలు చల్లంగా ఉండాలని కుల దేవతలను వేడుకొని పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనుముల మండలంలోని బంజారా భవనం దగ్గర గిరిజన మహిళలు ప్రత్యేక పూజలు, వంటకాలు తయారు చేసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేరులో ఉన్న దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఏడుగురు సీత్లా భవాని వద్ద మేకలు, యాటలను బలి ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వంటకాలను పశువులపై చల్లి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని, స్థానికులు అనారోగ్య బారిన పడకుంట కాపాడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బుడియా బాపు పీఠాధిపతి ఆంగోతు భగవాన్‌నాయక్, చంద్రుడునాక్, బానోతు సక్రునాయక్, సపావత్ పాండునాయక్, కుర్ర శంకర్, జవహర్‌లాల్, అశోక్, నరేష్, సర్దార్, విజయ్, నాగేందర్, బద్దు, చిన్నానాయక్, శోభన్‌బాబు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు తదితరుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : టీఎస్‌యూటీఎఫ్

మిర్యాలగూడ టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు బక్కా శ్రీనివాసాచారి, గోపనబోయిన నాగమణి కోరా రు. సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం డివిజన్ పరిధిలోని గురుకులాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే సంఘం టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. ప్రభు త్వం ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీన రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు శ్రీనివాసరెడ్డి, చినవెంకన్న, శ్రీనివాస్, మధుసూదన్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

తండ్రీ, కుమారుడికి ఇంటర్నేషనల్ అవార్డు



శివను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

చింతపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): తెలుగు సాంస్కృతిక సాహితీ సేవా ట్రస్టు ఇంటర్నేషనల్ అవార్డును తండ్రి, కుమారుడికి బెంగళూర్‌లో ట్రస్టు సభ్యు లు అందించారు. మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన ముంజంపల్లి సోమబ్రాహ్మచారి సోమ శతకం, విశ్వకర్మవ్రతకల్పం, గ్రంథరచన(ఇత్తడి, రాగి, వెండి, బంగారం)లోహ శిల్పి అవార్డును అందజేశారు. సోమబ్రాహ్మచారి కుమారుడైన ముంజంపల్లి శివ రామాచారికి ప్రపంచంలోనే అతిచిన్న(సూక్ష్మంగా) శివ లింగాన్ని 0.5 ఎం ఎంతో తయారు చేశారు. దీంతో పాటు 0.5 ఎం ఎంతో తెలంగాణ అమరుల స్తూపం, పెన్సిల్ మొనపై గణనాథుని విగ్రహాన్ని తయారు చేయడంతో ట్రస్టు సభ్యులు గుర్తించారు. తండ్రి, కుమారుల ఇద్దరికి బెంగళూర్‌లో తెలుగు సాంస్కృతిక సాహితీ సేవా ట్రస్టు సభ్యులు ఇంటర్నేషనల్ అవార్డులను సోమవారం రాత్రి అందించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు కూడా తండ్రి, కుమారులను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందన తెలిపినట్లు వారు తెలిపారు.

చేరికలపై అసత్య ప్రచారం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, నాయకులు

కొండమల్లేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కాంగ్రెస్ నుంచి నలుగురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరితే 200 మంది పార్టీలో చేరారని చేస్తున్న అసత్య ప్రచారం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వాళ్లే చేర్చుకొని కాంగ్రెస్ నుంచి చేర్చుకున్నారని అనడం వారి అవివేకానికి నిదర్శమని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కాని వారిని పార్టీకి అంటగట్టడం తగదన్నారు. సమావేశంలో లక్కీదాస్‌నాయక్, కాసర్ల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, రాణిరాజునాయక్, సైదానాయక్, మంగ్యానాయక్, మంజుల రవి, యేకుల సురేష్, సురేష్, కిషన్, విఠల్, నాగేష్, చందర్, సైదులు, శ్రీధర్, కిషన్, రాంబాబు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు : బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్

పెద్దవూర, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే అందుతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్ ఆరోపించారు. మండలంలోని పులిచర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలకే చేరుతున్నాయే తప్పా పేదలకు అందడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కనీసం గుడిసె ఉన్నవారికి ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులకే ఇస్తుండడం బాధాకరమన్నారు. మొదటి విడతలో పేదలకు ఇళ్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుందర్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, మెండె సైదులుయాదవ్, సైదమ్మ, నాగయ్య, పుల్లారెడ్డి, వెంకటయ్య, చిరంజీవి, బుడిగపాక సత్యనారాయణ, ఎల్లయ్యగౌడ్, వెంకన్న, వెంకటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలి

కొండమల్లేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని అందుకనుగుణంగా కష్టపడి చదవాలని కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీర రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు యువత గురికావద్దని కోరారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు దుండిగళ్ల అశోక్, గుంటోజు ఆంజనేయులు, ఏవో యర్రమాద గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రవాణా శాఖ సేవలు మరింత ప్రియం

(5వ పేజీ తరువాయి)
మరింత ప్రియం

9,59,445 ఉన్నాయి. అందులో సూర్యాపేట జిల్లాలో 2,02,181, నల్లగొండ జిల్లాలో 5,14,675, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 2,42,589 ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరిలలో రవాణా శాఖ కార్యాలయాల సేవలు అందుతున్నాయి. ఈ కార్యాలయాల్లో ప్రతి రోజూ పెద్దసంఖ్యలో వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, పర్మిట్లు జారీ చేయడం, ఎన్‌వోసీలు ఇవ్వడంతో పాటు ఇంకా వివిధ రకాల సేవలందిస్తున్నారు.

ప్రతి రోజూ రూ.లక్ష భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ పెంచిన చార్జీలతో వినియోగదారులపై రూ.లక్ష వరకు భారం పడుతోంది. ప్రతి రోజూ లైసెన్సుల కోసం 200 వస్తుంటాయి. వాటిపై సుమారు రూ.20,000 వేలు అదేవిధంగా 150 నుంచి 200 వరకు రిజిస్ట్రేషన్స్ జరుగుతుండగా వాటిపై రూ.15,000, హైపోథికేషన్‌పై రోజుకు రూ.30,000, పర్మిట్లు, ఫిట్‌నెస్‌లకు రూ.10,000, ఇతర సేవలకు సంబంధించి రూ.25,000 వరకు అదనపు భారం పడుతోంది. సరాసరిన రూ.లక్ష వరకు భారం వినియోగదారుడు చెల్లించాల్సి వస్తుండగా, ఏడాదికి సుమారు రూ.3 కోట్ల వరకు ఉండనుందని అంచనా వేస్తున్నారు.

సమాచారం

గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు రేపు

డిండి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఈనెల 31వ తేదీన ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శీరిష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంఎసీ గ్రూపుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కళాశాలలోని అడ్మిషన్ రిజిస్ట్రేషన్ కౌంటర్ అభ్యర్థులు తమ పేర్లును నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు హా జరుకావాలని కోరారు. మధ్యాహ్నం 1 గంట తరువాత వచ్చినవారిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అనుమతి ఉండదని పేర్కొన్నారు 10వతరగతి మెరిట్ ప్రాతిపదికన ఈ ఎంపిక ఉంటుందన్నారు. ఎంపికైనవారి పేర్లు అదేరోజు వెల్లడించి ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఓసీ, మైనార్టీ విద్యార్థులు హాజరుకావొద్దని సూచించారు.

● మిర్యాలగూడ టౌన్ : ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావత్ కృష్ణనాయక్ తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో పరిమిత సీట్ల భర్తీకి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులు సంబంధిత ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో మిగిలిపోయిన సీట్ల కోసం ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

పెద్దఅడిశర్లపల్లి మాడ్గులపల్లి: మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూకోర్సుల స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు.కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ అప్‌గ్రేడ్ అయినట్లు చెప్పారు. సీఈసీ కోర్సులో 40 సీట్లకు 30 సీట్లు ఖాళీ ఉన్నాయని, అలాగే ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సులో 40 సీట్లకు20 సీట్లు ఖాళీ ఉన్నాయ ని వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంత బాలికలు స్పాట్ అడ్మిష న్లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

● మాడ్గులపల్లి : కేజీబీవీలో మొదటి సంవత్సరం బైపీసీలో 16 సీట్లు, ఎంపీసీలో 11సీట్లు ఖాళీగా ఉన్నాయని, 6, 7వ తరగతుల్లో కూడా సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థినులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని మా డ్గులపల్లి ఎస్‌వో సునీత సూచించారు.

● కేజీబీవీలో ఖాళీగా ఉన్న పీజీఎస్ ఆర్టీ బోటనీ బోధించడానికి పోస్టు ఖాళీగా ఉందని తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన పీజీ బోటనీ, బీఈడీ మహిళలు వచ్చే నెల 1లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : జూనియర్/ వెంకటేశ్వర: హరిహర వీరమల్లు / రాఘవ: హరిహర వీరమల్లు / విక్రోస్: హరిహర వీరమల్లు (3 స్క్రీన్లలో) దేవరకొండ : మనోజ్ : మైబెబీ మైత్రి వెంకటేశ్వర : హరిహర వీరమల్లు